మరొక రకం మనుషులున్నారు. వాళ్ళు మా ఆవిడ అనకుండా మాట ఎత్తలేరు. వాళ్ళావిడ అప్పుడెటువంటి స్థితిలోవున్నా ఆవిడ్ని రెక్కపుచ్చుకు మాటల మధ్యలోకి యీడ్చుకురావలసిందే. వాళ్ళు తాము చెప్పే దానికి వత్తాసుకోసం ఆవిడ్ని కూడా యీడ్చుకొచ్చి మన్ని మభ్యపెడతారు. మనం ఎప్పుడైనా ఆవిడ్ని చూడటం పడితే ఈ మాటల సుందరి మాయమైపోయి మనకు ఉపన్యాసకుడిచ్చిన పిక్చర్‌కి పూర్తిగా భిన్నమైన శాల్తీ కనపడుతుంది.

దుష్ప్రచారం అని ఏదైతే వుందో దాన్ని ఎదుర్కొనటం సులువు. కాని స్వయంప్రచారం చేసుకునేవారు వదిలే అజాగ్రత్త బాణాలే సూటిగా గుచ్చుకొని మన్ని గిలగిల్లాడించేస్తాయి.

ఏ సబ్బువాడాలో సబ్బుల కంపెనీల ప్రకటనలు నిర్ణయించినట్లు, వాడవలసిన దుస్తులు, చదవవలసిన పుస్తకాలు, చేయవలసిన స్నేహాలు, చూడవలసిన సినిమాలు, తినవలసిన వస్తువులూ అన్నీ మనకోసం ఎవరో ముందే నిర్ణయంచేసి ఉంచినట్లు కనపడుతుంది. ప్రీ పబ్లిసిటీవల్ల కుటుంబ జీవితమే గాకుండా వ్యక్తి జీవితాలూ ఎవరో నిర్దేశించినట్టు నడవ్వలసివస్తోంది. ఇది ఆలోచించినకొద్దీ మరీ దారుణమైన విషయం అని తోస్తుంది.

# పీచుమిఠాయి వేటలో...

నూలుచీర కట్టడమా, పట్టుచీర ధరించడమా – వాయిల్‌చీర చుట్టబెట్టుకోడమా. సిల్కుచీర సింగారించడమా, స్లిప్పర్లు వేసుకోవడమా బెల్టు షూ బిగించడమా, బన్‌పెట్టి జుత్తు గోపురంలా వేసుకోడమా, చిన్న ముడి వేసుకొంటే చాలా, వెనక 'వి' షేపు జాకెటు తొడగడమా, సంసార పక్షంగా లోనెక్ కాకుండా పట్టు రవిక వేసుకోవడమా – ఇలా యిలా నిత్య సందేహాలు లక్షరకాలివి క్వశ్చన్ మార్కుల్లా వచ్చి నిలుస్తాయి నాకు. నాకనేమిటి? ప్రతిభామిని డ్రెస్సప్పవటంలో, అలంకరించుకోవటంలో 'ఎలా వుంటే బాగుంటాను' అని సతమతం కావటం అన్నాచురల్ అని కొట్టి పారేయటం తగదు. ఆడవారి బాధలు ఆడవారివి. వీటినే అలంకరణ కోసం అద్దం ముందు కుస్తీపట్లు అని అన్నా అనవచ్చు. కుస్తీ ఎవరితో–మనసుతో – మనసు వెర్రిబాగులది–అది గుర్రం–మనసు గుర్రమురోరి మనిషి అన్నారు కవిగారు. గుర్రానికీ సమస్యలుండవనుకోండి దవుడు తీయడం తప్ప.

మనం సుఖంగా జీవించాలంటే కోరికల్ని పెంచుకోవడం తప్పంటారు వేదాంతులు. ఇవి చిన్న కోరికలే కదా – యివీ లేకపోతే జీవితం డల్‌గా మరియు మరోజుగా వుంటుందని వాపోతారు లలనామణులు. కాని మనం ఎంతవరకు మనకోసం జీవిస్తున్నాం. ఎంతవరకు యితరుల కోసం జీవిస్తున్నాం అనే ప్రశ్నకు ఎప్పుడో ఒకప్పుడు ఎక్కడో ఒకచోట జవాబు చెప్పుకోవాల్సుంటుంది. మనం మనకోసమే జీవిస్తున్నాం కాని ఇతరుల కోసం కాదు అనేది

పరమసత్యం. దాన్ని చాలా మంది ఆడవాళ్ళు ఒప్పుకొనజాలరు, అందువలననే లక్షాతొంభై పేచీలు, సణుగుళ్లూ, చికాకులు వస్తాయి సం-సారాల్లో. ఉన్నదానిలో ఉన్నంత శుభ్రంగా నీటుగా వుండాలి. అయితే ఎంత? దానికి అమ్మాయిగారు జవాబు చెప్పలేరు. ఆ ఎంతే యింతింత్తై కొంపముంచవచ్చు. వీటిని ఆంగ్లంలో లిమిటేషన్సు అంటారు. వీటిని తెలుసుకోవడం ఒక పీచుమిఠాయి వేటలాటిది.

ఎవరేమనుకుంటారో అన్జెప్పి అప్పటికప్పుడు బజారికి పంపి అప్పుజేసి పప్పుకూడు తినిపించే అమ్మాజమ్మలున్నారు మనలో. నూలుచీర కట్టుకుంటే ఏవనుకుంటారు? పట్టుచీర కట్టుకుంటే ఏవనుకుంటారు? రిక్షామీద వెళితేతలతీసేస్తారా? టాక్సీలో వెళ్తే ఎదురుగుండా వచ్చి మంగళహారతి పడతారా? నడిచివెళ్తే ఫడాల్మని లెంపకాయ కొడ్తారా? ఇవన్నీ అనుకోడాలు - మిడిల్ క్లాసు జీవితం ఈ అనుకోడాల అనుమానపు సుడిగుండంలో పడిపోయి దివాలా తీస్తోంది. స్టేటసు అని పైకననుగాని చాలా మంది స్త్రీలు మన అంతస్థుకు తగినట్లు వున్నదానిలో ఉన్నంత - అని సన్నాయి నొక్కులు నొక్కుతారు. సోషల్ లైఫ్‌కి ఆడవాళ్ళ అభిరుచులే ప్రాణం. అయితే మనకి ఆడవాళ్ళ ప్రపంచం వేరు, మగవాళ్ళ ప్రపంచం వేరు అయినందున ప్రతి మనిషీ ఇంట్లో విఘ్నేశ్వరుడైన పరమేశ్వరుడు. ఇంట్లో సనాతనుడు ట్రెడిషినలిస్టు మరియు గాడ్ ఫియరింగు నేచరు బయట డిమోక్రటు, రాడికల్ లేదా ఉగ్రవాది. మన జీవితంలో ఈ కాంట్రడిక్షన్స్ చాలా అందమైనవి. అంచాత మగాళ్ళు ఒకప్పుడు మొదవుకనుసన్న వృషభాల్లా మరొకప్పుడు స్వేచ్ఛా ప్రియుళ్ళా, డామ్‌కేర్ మాస్టర్లలా వుండడం కద్దు.

అయ్యా మన జీవితాల్లో డబల్ స్టాండర్డ్సు అన్నిటా వున్నాయి. సొసైటీ నిండా వున్నాయి ప్రతి ఆడదానికీ మగాడికి కనీసం మినిమం రెండు ముఖాలన్నా వున్నాయి. ఒకటి లోపలా ఒకటి బయటా - ఓపెన్ లైఫ్ ఎవరికీ లేదు.

మీరు కనిపెట్టారో లేదో - ఈ రెండు ముఖాల చాటు మాటుతనాన్ని పిల్లలు సహించరు. వాళ్ళకిందులోని దుర్మార్గవూ తెలీదు. అంచేత వాళ్ళు ఠపీమని కట్‌చేసి పెద్దవాళ్ళ నిజరూపాల్ని బహిర్గతం చేస్తూ వుంటారు.

మచ్చుకి నేనోమారు మా తోటికోడలు చీర కట్టుగున్నాను పేరంటానికి. దాని కొడుకు వచ్చి పేరంటంలో నా ఒళ్ళో కూర్చుని "మా అమ్మ చీర ఎందుకు కట్టుకున్నావ్, విప్పే"మని ఏడుపు మొదలెట్టాడు. నిజంగా ఏడవాల్సింది నేను. అట్లాగే - మొన్నోసారి మావార్ని లోపలకొచ్చి కాఫీ తాగండన్నాను. చెంబులోపోసి మూతపెట్టిన కాఫీ ఒక్కరికే సరిపోతుంది. వీధిలో చాలామంది వున్నారు. పాలులేవు. ఇవ్వాలన్నా యిబ్బందే - ఆయన లోపలికొస్తే కాఫీగ్లాసు అందిచ్చాను. "వేడి సరిపోతుందా" అంటూ. ముఖం అయిష్టంగానే పెట్టి కాఫీమీద భ్రమవలన తాగుతున్నారు. పెదిమలు చప్పరిస్తూ, మూతి సరిచేసుకొంటూ వెళ్ళకండి బావుండదు అన్నాను. ఇంట్లోకెళ్లి కాఫీ తాగొచ్చాడని ఆయన గురించి ఎవరైనా అనుకున్నా క్యారెక్టర్ అసాసినేషన్ కదా - ఇంతలో ఎవరో మీ నాన్నగార్ని పిలు అమ్మా అని మా చంటిదాన్ని అడిగారు. లోపల

కాఫీ తాగుతున్నారు - ఇప్పుడే వచ్చేస్తారు కూర్చోండి అంది మా కుర్రది. ధామ్మని దాని వీపుబద్దలు కొడదామన్నంత కోపం వచ్చింది. ఖాన్‌దాన్‌కా ఇజ్జత్ అంతా మా అమ్మాయి మంటగలిపేసింది. మరొకసారి మావారు కాతాకొట్లో రెండు సిగరెట్టు పెట్టెలు పట్రమ్మన్నారు మా నాలుగో వెధవని, డబ్బుల్లేనప్పుడు అరువుమీద రెండు మూడు పెట్టెలు కాల్చేస్తారు మావారు. ఉత్తప్పుడు పెట్టిమీద పెట్టె కొని కాలుస్తారు. ఇంతలో మావారి ఫాన్‌గారొకాయన వచ్చి తిష్ఠవేశాడు ముందు గదిలో - అప్పుడు మా వెధవ వచ్చి "సిగరెట్లు అరువివ్వనంటున్నాడు నాన్నారూ" అన్నాడు. అప్పుడు మావారు చిరునవ్వు నవ్వి "నేన్చెప్పానని చెప్పు" అన్నారు. "మీరు చెప్పినా యివ్వడ్ట " అని మళ్ళీ వచ్చి చెప్పాడు. అప్పుడు నేను కలగచేసుకుని "పది రూపాయల నోటు మార్చిపట్టుకురారా" అన్నాను. "పొద్దున్నే పదిరూపాయల నోటు చిల్లరెక్కడ దొరుకుతుందే" అన్నారు మావారు. అప్పుడు మావారికోసం వచ్చిన ఫానుగారు నా దగ్గరున్నాయి లెండి నేనిస్తాను అని రెండు అయిదు రూపాయల నోట్లు పైకి తీశాడు. అసలు పది రూపాయల నోటు లేదుగదా ఖర్మ. అప్పుడు మావారు కంగారుపడకుండా - వాడే యిస్తాడులెండి కొట్టువాడు. బోణికాలేదేమో యింకా - పదిరూపాయల నోటుకి చిల్లరివ్వకుండా సిగరెట్లుయిస్తే అరువు బేరంతో ప్రారంభమవుతుందని భయపడుతున్నాడు షావుకారు (షావుకారు)అని విపులీకరించారు "మీకెందుకండీ శ్రమ" అంటూ. అన్నకొద్దీ ఆయన లేచిపోతున్నాడు. 'వుండండి గురువుగారూ నేను తెస్తాను అంటూ, అలా ఆ రోజా మహా మెస్సయిపోయింది వ్యవహారం. దీన్నే పీచుమిఠాయి వేట.... అంటారు తెలుగులో. రమారమణ గోవిందో హారి -

# ప్రియే! మిసప్రాప్రియే!

**క**టువైన నిజాల్ని చెప్పి నొప్పించటం కంటె మృదువైన అబద్ధాల్ని చెప్పి సంతృప్తి పరచటం మంచిదికదా - జీవితంలో ఎన్నో అందమైన అబద్ధాల్ని చెప్పాలిసొస్తుంది తప్పదు మరి. "నీ దగ్గరేం దాచను సుశీ" అంటూనే ఎన్నో హరికథలు చెప్తాడు భర్త. "డబ్బు అప్పుడే అయిపోయిందా?" అని ముఖం చిట్లిస్తున్న భర్తను "వుండండి ఆలోచించుకుని చెప్తా" నంటూ ఆవిడ కొన్ని అబద్ధాలను అల్లటానికి టైమడుగు తుంది. ఏ చీటీ గుడ్డలవాడో, చీరలమ్మేవాడో, స్టీలుగిన్నెల షాపువాడో, లేకపోతే రహస్యంగా చీటీకట్టడమో, ఇలాటి చిన్న చిన్న మిసప్రాప్రియేషన్‌లు ప్రతి ఇల్లాలికి తప్పవుమరి. చాలామంది హజ్బెండులు యీ రవి కెక్కడిది. యీచెంచా ఎక్కడిది, యీ గిన్నె ఎక్కడిది? యీరుమాళ్ళు రిబ్బన్లు, పూసలు, గాజులు, దండలు ఎక్కడవని ఆరాలు తీయజాలరు. దోసకాయపప్పు, బంగాళదుంప వేపుడు, వంకాయ బజ్జిపచ్చడి చేసిపెడితే తినేసి మూతి తుడుచుకుని లేచ్చక్కాపోతారు. అయితే కొద్దిమంది చాదస్తపు పురుషులు